# వైభవంగా మహా పడిపూజ

**పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

గుమ్మడిదల, డిసెంబర్ 16 : అయ్యప్ప స్వామి దివ్య మహాపడిపూజలతో పారిశ్రామికవాడ ఆధ్యాత్మిక వాతావరణంలో పులకరించింది. సోమవారం మండలంలోని బొంతపల్లి-వీరన్నగూడెంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో 34వ వార్షికోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి గణపతిహోమం, మంగళగౌరీవ్రతాలు, మహిశిమర్ధని దిష్టిబొమ్మదహనం, ఆరట్టు, స్వామి వారిని పల్లకి సేవలో ఊరేగించారు. ఈ వేడుకకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, భారతీనగర్‌డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి దంపతులు, బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. అనంతరం వచ్చిన స్వాములు, భక్తులకు అల్పాహారం వితరణ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మమతావేణు, ఆలేటి నవీనారెడ్డి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, డిసెంబర్ 16 : రామ్‌తీర్థ్ గ్రామానికి చెందిన నర్సింహులుకు మంజూరైన రూ. 60 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం బాధితుడికి ఖానాపూర్ కే గ్రామంలోని స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. యువనాయకులు ప్రశాంత్‌సాగర్, మహేందర్‌గౌడ్, ప్రమోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న డీసీసీబీ మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి

పుల్కల్, డిసెంబర్ 16 : పుల్కల్ పీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఆగస్టు 26న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వచ్చిన ఓపీ ఉన్నా.. సౌకర్యాలు సున్నా, కథనానికి, తిరిగి డిసెంబర్ 1న ప్రచురించిన వరుస కథనాలకు అధికారులు స్పందించారు. సోమవారం ఎన్ఆర్ఈజీఎస్ కింద వంద మీటర్లు సీసీ రోడ్డుకు రూ. 14 లక్షల నిధులు మంజూరు కావడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు వరకు కొబ్బరి కాయ కొట్టి అధికారులు, నాయకులు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ శశికుమార్, డాక్టర్ సాయి కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో షరీఫ్

రాయికోడ్, డిసెంబర్ 16 : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఎంఎం షరీఫ్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో నేటి నుంచి వంద శాతం కూలీల సంఖ్యను పెంచాలన్నారు. గ్రామాల నుంచి వలసలు వెళ్లకుండా జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించి, కూలీల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో అంజాలిదేవి, ఏపీవో రమేశ్, మండల ఉపాధిహామీ క్యూసీ విష్ణువర్ధన్‌సాగర్, ఉపాధిహామీ సిబ్బంది తుకప్ప, మూరాలి, వరప్రసాద్, కరుణయ్య ఉన్నారు.

## గండి చెరువు ఎఫ్‌టీఎల్ సామర్థ్యాన్ని తగ్గించాలి

బొల్లారం డిసెంబర్ 16 : జిన్నారం మండలం కాజిపల్లి గండి చెరువు పూర్తి ట్యాంక్ లెవెల్ తగ్గించాలని ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ సోమవారం జిల్లా సూపరిండెంట్ ఇంజినీర్ యేసయ్యను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు లిఖిత పూర్వకంగా వినతి పత్రాన్ని అందజేశారు. ధర్మ చెరువు లోకి పరిశ్రమల వ్యర్థ జలాలు చేరి చెరువును పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయని తెలిపారు. సాగునీటి కోసం రెండు చెరువులపైనే ఆధారపడి రైతులు జీవిస్తున్నట్లు తెలిపారు. రైతులను పర్యావరణాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనవ్యర్థాలు డంప్ చేసిన ప్రాంతం పరిశీలన



పారిశ్రామిక వాడలో ఘన వ్యర్థాలు డంప్ చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారి రవీందర్

బొల్లారం డిసెంబర్ 16 : ప్రజారోగ్యంపై పట్టింపేది శీర్షికన ఈనెల 14న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పీసీబీ అధికారులు స్పందించారు. సోమవారం పీసీబీ ఏఈ కుమార్ పాట ఆదేశాల మేరకు అధికారి రవీందర్ పరిశ్రమల ఘన వ్యర్థాలు డంప్ చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించే బహిరంగ, నిర్మానుష్య ప్రదేశాల్లో ఘన వ్య ర్థాలను పారబోయడం, కాల్చివేయడం చేయకూడదని హెచ్చరించారు. ఘటనపై సేకరించిన సమగ్ర వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## హెచ్‌సీఏ టోర్నీకి ఇద్దరు గురుకుల విద్యార్థులు



ధనుష్, కార్తీక్

బొల్లారం, డిసెంబర్ 16 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి నిర్వహిస్తున్న అండర్ 14 స్కూల్స్ క్రికెట్ టోర్నీకి జిన్నారం గురుకుల క్రికెట్ అకాడమీకి చెందిన విద్యార్థులు ధనుష్, కార్తీక్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్ నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, కోచ్ మహేశ్ సోమవారం తెలిపారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకి చెందిన 8వ తరగతి విద్యార్థులు రాథోడ్ ధనుష్, కార్తీక్, జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులు అండర్ 19,17, 14 ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని కేటగిరీల పోటీలకు (2డే లీగ్ వన్డే లీగ్ అండర్ 19, 16,14 హెచ్‌సీఏ) విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కోచ్‌ను ఈ సందర్భంగా అభినందించారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇన్‌చార్జి ఎంఈవో మద్దతు



దీక్ష వద్ద మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈవో కుమారస్వామి

బొల్లారం, డిసెంబర్ 16 : సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జిన్నారం ఇన్‌చార్జి ఎంఈవో కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం దీక్షాస్థలిని సందర్శించి సమ్మె చేసున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు మద్దతు పలికారు. డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.

## అక్రమంగా నల్ల మట్టి తరలింపు

బొల్లారం డిసెంబర్ 16 : అక్రమంగా నల్ల మట్టిని తరలిస్తున్న వాహనాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. జిన్నారం మండలం మంగంపేట గ్రామంలోని గండె వాని కుంటలో ఇష్టానుసారంగా రాత్రి వేళల్లో నల్ల మట్టిని తరలిస్తున్నారని సమాచారం అందుకున్న గ్రామస్తులు వాహనాలను అడ్డుకున్నారు. వెంటనే గ్రామస్తులు రెవెన్యూ, పోలీస్, అధికారులకు సమాచారం అందించారు. కుంట నుంచి అక్రమంగా నల్ల మట్టిని తరలిస్తున్న ఒక జేసీబీ, మూడు లోడు చేసిన ట్రాక్టర్లను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. చెరువులు, కుంటలు ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతిభను వెలికితీయడానికే క్రీడాపోటీలు

**కలెక్టర్ వల్లూరి క్రాంతి**



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 16 : రాష్ట్రంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ పోటీలకు సిద్ధం చేయడం కోసమే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలను జ్యోతివెలిగించి కలెక్టర్ ప్రారంభించారు. ముందు గా ఎన్‌సీసీ విద్యార్థులు, క్రీడాకారుల కవాత్తు నిర్వహించిన అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలకు 27 మండలాలు, 8 మున్సిపాలిటీలు పాల్గొనడం జరిగిందన్నారు. వాటిలో ఖోఖో , కబడ్డీ, యోగా, చెస్ పోటీల్లో వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు వారికి ఇష్టమైన క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజ య్య, జిల్లా లైజనింగ్ ఆఫీసర్ ఫర్ స్టేట్ లెవల్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ, స్కూల్ గేమ్స్ జిల్లా సెక్రెటరీ అమూల్యమ్మ, జిల్లా అధికారులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

## సమయానికి రారు.. సమస్యలు పరిష్కరించరు

**12 గంటలైనా తెరుచుకొని పంచాయతీ కార్యాలయం**



చీకుర్తి గ్రామంలోని పంచాయతీ కార్యాలయానికి తాళం వేసిన దృశ్యం

జహీరాబాద్, డిసెంబర్ 16 : న్యాల్‌కల్ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమయానికి రాకపోవడంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని చీకుర్తి గ్రామం పంచాయతీ కార్యదర్శి సోమవారం 12 గంటలు దాటినా కార్యాలయానికి హాజరుకాలేదని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎవరికి చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. గ్రామంలోని పలు వార్డులో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కొన్ని రోజులుగా పంచాయతీ కార్యదర్శి విధులకు సక్రమంగా హాజరుకావడం లేదన్నారు. గ్రామ ప్రత్యేకాధికారి కూడా ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని గ్రామంలో నెలకొన్న అధికారులు సమయపాలన పాటించి, గ్రామంలో సమస్యలను పరిష్కరించేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## యోగాతో మానసిక ఒత్తిడిని జయించొచ్చు



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధి హేమతల, చిత్రంలో ప్రిన్సిపాల్ రవీందర్

రామచంద్రాపురం, డిసెంబర్16 : విద్యార్థులు మెడిటేషన్‌తో మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని బీహెచ్‌ఈఎల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధి హేమలత అన్నారు. సోమవారం భెల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో మెడిటేషన్, యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవ్వకుండా ఒత్తిడిని దూరం చేసి చదువుపై శ్రద్ధ చూపించాలని అన్నారు. మెడిటేషన్, యోగా ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చని తెలిపారు. అనంతరం మెడిటేషన్‌కు సంబంధించి విద్యార్థులకు మెలకువలను వివరించారు. సిబ్బంది ఉన్నారు.

## మిషన్ భగీరథ పనులను త్వరగా పూర్తి చేయాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్ రెడ్డి**



మిషన్ భగీరథ పైప్లైన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న చైర్పర్సన్ రోజా బాల్ రెడ్డి

బొల్లారం డిసెంబర్ 16 : ఇంటింటికీ తాగు నీరందించేందుకు చేపడుతున్న మిషన్ భగీరథ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం 11వ వార్డు బీరప్ప బస్తీ, 22వ వార్డు మల్లన్నబస్తీల్లో ఆమె పర్యటించి మిషన్ భగీరథ పనులతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కౌన్సిలర్లు శ్రీకాంత్ యాదవ్, ఏఈ కిష్టయ్య, స్థానికులు శ్రీనివాస్, రాజు, ఇంజనీరింగ్ సిబ్బంది ప్రశాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ముత్తంగికి రోజూ తాగునీరు సరఫరా

**మిషన్ భగీరథ ఈఈ విజయలక్ష్మి**



ముత్తంగిలో మిషన్ భగీరథ నూతన పైప్‌లైన్ ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న ఈఈ విజయలక్ష్మి

పటాన్‌చెరు, డిసెంబర్ 16 : ముత్తంగి గ్రామానికి ప్రతి రోజూ తాగునీరు సరఫరా చేస్తామని మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ పరిధిలో నూతనంగా వేస్తున్న తాగునీటి పైప్‌లైన్ పనులను ఆమె పరిశీలించారు. ముత్తంగి గ్రామం పరిధిలో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న క్రమంలో రెండున్నర నెలల క్రితం కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ మెయిన్‌లైన్ పైప్‌లు పగిలిపోయాయి. ఆ తర్వాత గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామాన్ని తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేయడంతో తాగు నీటి సరఫరా సమస్యను ఎవరు పట్టించుకోలేదు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ఈ నెల 12న మళ్లీ నీటి సమస్య అని రెండు నెలలుగా తాగునీరు రావడం లేదని ప్రత్యేక కథనం రావడంతో స్పందించిన మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు ప్రత్యేక లైన్‌వేసి ముత్తంగికి తాగునీరు అందజేసేందుకు పనులు నిర్వహిస్తున్నారు. పైప్‌లైన్ వేసే ప్రక్రియలో పలు ఆటంకాలు వచ్చినా పనులు జరుగుతున్నాయి. సోమవారం వరకు పనులు కొలిక్కి వచ్చినట్టు ఈఈ తెలిపారు. కొన్ని వ్యాపార సంస్థల ముందు పైప్‌లైన్ వేసేందుకు అడ్డంకులు కల్పిండంతో పనులకు ఆవంతరాలు వచ్చాయని, వాటిని గ్రామ నాయకుల సహకారంతో పరిష్కరించుకుని పనులు పూర్తి చేస్తున్నామన్నారు. మంగళవారం వరకు గ్రామానికి తాగునీరు అందజేస్తామని చెప్పారు. రోడ్డు విస్తరణ పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థ సిబ్బంది తాగునీటి పైప్‌లైన్‌ను తరచు ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇక మీదుట పైప్‌లైన్‌ను ఎక్కడ ధ్వంసం చేయకుండా పనులు జరిగేలా చూస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చాడన్నారు. ఈ కార్యక్రమంలో గ్రిడ్ ఏఈ కవి త, తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు మాజీ సర్పంచ్‌ల అరెస్టు



రాయికోడ్ పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

రాయికోడ్, డిసెంబర్16 : పెండింగ్ బిల్లు ల కోసం అసెంబ్లీ ముట్టడికి హైదారాబాద్ తరలి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్టు చేశామని హెడ్ కానిస్టేబుల్ శ్రీశైలం తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన రాయికోడ్ పోలీస్ స్టేషన్‌లో వివిధ గ్రామాల్లో ఉన్న బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేశారు. మాజీ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, మండల ముదురాజ్ సంఘం అధ్యక్షుడు తమ్మాలి రాజు, బీఆర్ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షుడు అంజి ఉన్నారు.

**నాగల్‌గిద్దలో..**

నాగల్‌గిద్ద, డిసెంబర్ 16 : పెండింగ్ బిల్లు చెల్లించకుండా తత్సారం చేస్తున్న ప్రభుత్వం తీరును నిరసనగా సోమవారం రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లకు ఎస్సై సాయిలు పోలీస్ సిబ్బంది అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పని చేసిన మాకు బిల్లులు చెల్లించకుండా పోలీసువారితో అణిచివేయడం దారుణమన్నారు. స్టేషన్‌కు తరలించిన వారిలో అంజిరెడ్డి, విఠల్‌రావ్, జాదవ్ మా రు తి, మేత్రి పండరి, దేవేందర్, ఫుల్‌సింగ్ తదితరులు ఉన్నారు.



అరెస్టు అయిన మాజీ సర్పంచ్‌లు

## పుల్కల్ కేజీబీవీలో 'వాయిస్ ఫోర్ గర్ల్స్'

పుల్కల్, డిసెంబర్ 16 : మండల కేంద్రమైన పుల్కల్ కేజీబీవీ బాలికల పాఠశాలలో ఈ నెల 13 తేదీ నుంచి వాయిస్ ఫోర్‌గర్ల్స్ అనే ఎన్‌జీవో సంస్థ వారు బాలికల ఆరోగ్యం, చదువు, భవిష్యత్ గురించి అవగాహన కార్యక్రమం కొనసాగుతుందని ఫీల్డ్ కో-ఆర్డినేటర్ సాహితి తెలిపారు. పాఠశాలను సందర్శించిన సందర్భంగా ఎన్‌జీవోలు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న తీరును ఎంఈవో శంకర్ ప్రశంసించారు. క్యాంప్ కో-ఆర్డినేటర్లు స్ఫూర్తి, సౌమ్య, మధురిత, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్మికులకు వేతనాలు చెల్లించేదెప్పుడు ?

- కార్మికులకు వేతనాలు చెల్లింపులో జ్యాపం ఎందుకు
- పట్టించుకొని అధికారులు, కాంట్రాక్టర్లు



న్యాల్‌కల్ మండలం రాఘవపూర్ మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ వద్ద అందోళ న చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు (ఫైల్)

జహీరాబాద్, డిసెంబర్ 16 : వేతనాలు కోసం ఆందోళన చేస్తున్న మిషన్ భగీరథ కార్మికుల తాగునీటిని సరఫరాను నిలిపివేయడంతో జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ మండలాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 26 రోజులుగా ఆయా మండలాల్లోని దాదాపు 74 గ్రామాలకు మిషన్ భగీరథ పథకం కింద తాగునీరు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. సంబంధిత మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆయా మండలాలకు రాఘవపూర్ శివారులోని మిషన్ భగీరథ పంప్ హౌస్ నుంచి ఆయా మండలాలకు ప్రతి రోజు తాగునీరు సరఫరా అవుతున్నది. ఆయా మండలాలకు తాగునీటి సరఫరా చేసేందుకు నియమించిన క్షేత్రస్థాయిలో పని చేసే కార్మికులకు తొమ్మిది నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలను చెల్లించడం లేదు. పలుమార్లు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు వేతనాల కోసం మొరపెట్టుకున్నా ఫలితం లేకవడంతోనే అందోళనకు దిగారు. గత నవంబర్‌లో మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికులకు ఒక నెల జీతాన్ని అందజేసి, మిగిలిన ఆరు నెలలకు సంబంధించి 20వ తేదీలోగా చెల్లిస్తామని సంబంధింత అధికారుల సమక్షంలో కాంట్రాక్టర్ ఒప్పంద పత్రాన్ని రాసి తాత్కాలిక కార్మికులకు అందజేశారు. ఇచ్చిన ఒప్పంద మాట ప్రకారం కార్మికులకు వేతనాలను చెల్లించకపోవడంతో ఆందోళనకు దిగారు. వేతనాల చెల్లింపు విషయంలో రెండు, మూడు సార్లు సంబంధిత జిల్లా, మండల అధికారులు కార్మికులతో జరిపిన చర్చలు విఫలమైయ్యాయి. గత 26 రోజులుగా కార్మికుల చేస్తున్న ఆందోళనతో ఆయా మండలాలకు తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ఆయా మండలాల్లో మిషన్ భగీరథ నీళ్లను నమ్ముకొన్న ప్రజలు ముప్పుతిప్పలు పడుతున్నారు. పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొన్నది. ట్యాంకర్ల వద్ద జనం గుమికావడంతో మహిళల మధ్య ఘర్షణకు తావిస్తోంది. బిందెడు నీళ్ల కోసం గ్రామాల సమీపంలోని వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. ఆయా మండలాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నప్పటికీ కార్మికులకు వేతనాల చెల్లింపులో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ జ్యాపం చేయడంలో అంతర్యమేమిటాని పలువురు ప్రశ్నిస్తున్నారు. రానున్న క్రిస్మస్ పండుగాను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆయా మండలాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై సంబంధిత మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లాగా.. ఆయా మండలాల్లోని గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికుల వేతనాల కోసం సంబంధిత జిల్లా అధికారులు కాంట్రాక్టర్‌తో చర్చిస్తున్నామన్నారు. కార్మికులకు రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



తాగునీటి సరఫరా నిలిచిపోయడంతో బోసిపోయిన రాఘవపూర్ మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ ప్రాంతం

## బీఆర్ఎస్ నాయకుల అరెస్టు



పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

సదాశివపేట, డిసెంబర్ 16 : దళిత బంధు రెండో విడుత నిధులు విడుదల చేయాలని అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వం వెంటనే దళితబంధు నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన వారిలో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు నందికంది సుధాకర్, మాజీ సర్పంచ్ ఇంగ్లపు అశోక్, కంబాలపల్లి మా జీ సర్పంచ్ పెద్దగొల్ల శ్రీహరి ఉన్నారు.

## పట్టపగలే చోరీ

కంగ్టి, డిసెంబర్ 16 : పట్టపగలు చోరీ జరిగిన ఘటన కంగ్టి మండలం దెగుల్‌వాడీలో సోమవారం చోటు చేసుకుంది. కంగ్టి ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దెగుల్‌వాడీ గ్రామానికి చెందిన ధన్‌రాజ్ దేశాయి మధ్యాహ్నం వేళలో ఇంటితాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లారు. దొంగలు తాళాన్ని పగులకొట్టి చోరీ చేశారు. ఇంట్లో బీరువాలో ఉన్న 5 తులాల బంగారం, రూ. లక్ష నగదు అపహరించారన్నారు. ఇంటివచ్చి చూసే సమయానికి తాళం పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువాలో ఉన్న బంగారం, నగదు లేవని తెలిపారు. వస్తువులన్ని చిందరవందరగా పడేశారన్నారు. ఎస్సై విజయ్ కుమార్ వెంటనే క్లూస్‌టీమ్ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమో దు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై వివరించారు.

## బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

కల్హేర్, డిసెంబర్ 16 : బైక్‌పై వెళ్తున్న క్రమంలో 161నంబర్ హైదరాబాద్-నాందేడ్ జాతీయ రహదారిపై వ్యక్తిని ఢీకొని మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్టానికి చెందిన సకల్ దేవ్ రాయ్ (32) కుందన్‌కుమార్ యాదవ్ కలిసి పిట్లం నుంచి నిజాంపేట్ వైపు బైకుపై వెళ్తున్నారు. ఈ క్రమంలో మహాదేవుపల్లి చౌరస్తా సమీపంలోని వెంకటాద్రి ఫంక్షన్ హాల్ ఎదురుగా జాతీయ రహదారిపై షెకల్‌కుంట తండాకు చెందిన బాబునాయక్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తు లిఫ్ట్ కోసం బైక్‌ను ఆపేందుకు ప్రయత్నించారు. లిఫ్ట్ అడుగుతూ అటు ఇటూ తొగిసలాడుతుండడంతో బైక్ వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో బైకు నడుపుతున్న సకల్‌దేవ్ రాయ్ అక్కడికక్కడే మృతి చెందగా, కుందన్‌కుమార్‌కు గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుందన్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశం తెలిపారు.

## కృష్ణారెడ్డికి సేవారత్న అవార్డు



ఢిల్లీలో అవార్డును అందుకుంటున్న సంఘ సేవకులు ఆనంద్ కృష్ణారెడ్డి

బొల్లారం డిసెంబర్ 16 : సామాజిక సేవలో నిరంతరం కృషి చేస్తున్న బొల్లారం మున్సిపాలిటీకి చెందిన కేజేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆనంద్ కృష్ణారెడ్డి సేవారత్న జాతీయ అవార్డును అందుకున్నారు. సో మవారం రాజధాని ఢిల్లీలో బహుజన సా హిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతులమీదుగా అవార్డును అందజేసి సన్మానించింది. ప్రతిష్టాత్మక జాతీయ సేవారత్న అవార్డును అందుకోవడంపై ఆనంద్ కృష్ణారెడ్డి సం తోషం వ్యక్తం చేశారు. ప్రతినిధి శ్రీనివాస్, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

## నేడు పిరామల్‌కు పీసీబీ అధికారుల రాక

కోహీర్, డిసెంబర్16 : మండలంలోని దిగ్వాల్ ఫార్మా పరిశ్రమను తనిఖీ చేసేందుకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మంగళవారం రానున్నారని పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. పరిశ్రమలో రసాయనాల వినియోగం, కాలుష్య నియంత్రణ చర్యలపై వివరాలను తెలుసుకుంటారన్నారు. అనంతరం శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌లో పరీక్షిస్తారని చెప్పారు.

## నేటి నుంచి ఓడీఎఫ్‌లో క్రీడాపోటీలు

కంది, డిసెంబర్ 16 : కంది మండలం ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు ఎవీఎన్ఎల్ చైర్మన్స్ కప్ 2024 క్రీడా పోటీలు జరగనున్నాయి. ఎవీఎన్ఎల్ రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగే క్రీడా పోటీలను ఓడీఎఫ్‌లోని శరత్ స్టేడియంలో నిర్వహించనున్నారు. క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు.